దొంగల బీభత్సం

- ఒంటరి మహిళ ఇంట్లోకి చొరబడ్డ ఆగంతకులు
- కాళ్లు, చేతులు కట్టేసి బంగారు గొలుసు, నగదు చోరీ

తెలంగాణ చౌక్, మార్చి 21:జిల్లాకేంద్రం లోని బీవై నగర్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒంటరిగా ఉంటున్న మహిళ ఇంట్లోకి చొరబడి కాళ్లు చేతులు కట్టేసి మెడలోని గొలుసు, నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన పరకాల లక్ష్మి ఓ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి నలుగురు దుండగులు ఆమె ఇంట్లోకి చొరబడ్డారు. గమనించిన ఆమె కేకలు వేస్తుండగా, వెంట తెచ్చుకున్న కత్తులతో బెదిరించి తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేశారు. ఆమె మెడలోని తులం విలువైన బంగారు గొలుసు, దాచుకున్న ₹4వేల నగదు ఎత్తుకెళ్లారు. గురువారం తెల్లవారుజామున మహిళ బంధువులకు ఫోన్ చేయగా వారు వచ్చి కట్లు విడిపించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి పేర్కొన్నారు. కాగా, ఇటీవలి కాలంలో పట్టణంలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేములవాడ, మార్చి 21: పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. యజమాని రవి గౌడ్ బంధువుల ఇంటికెళ్లారు. తిరిగి వచ్చేసరికి సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. లక్ష రూపాయల వరకు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- వెంకట్రావుపల్లెలో చెక్‌పోస్ట్ పరిశీలన

ముస్తాబాద్: వెంకట్రావుపల్లె చెక్‌పోస్ట్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ముస్తాబాద్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలతోపాటు పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని, తరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. 24గంటలపాటు గ్రామాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను విధిగా సందర్శించి, ఏమైనా సమస్యలుంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే జిల్లా సహరిహద్దు వెంకట్రావుపల్లె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉంటూ, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా ₹50వేల కంటే ఎక్కువ నగదును ఆధారాలు లేకుండా తరలిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

లావాదేవీలపై దృష్టిపెట్టాలి: అదనపు కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాంకుల పరిధిలో అనుమానిత లావాదేవీలపై దృష్టిపెట్టాలని బ్యాంకు అధికారులను అదనపు కలెక్టర్ పూజారిగౌతమి ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా బ్యాంకుల కోఆర్డినేటర్లతో సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ గురువారం సమావేశమై, మాట్లాడారు. బ్యాంకుల నుంచి ₹లక్ష నగదు తీసుకున్నా, ఖాతాలో వేసినా వారి వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ₹10లక్షల కంటే ఎక్కువ జమ అయినా, తీసుకున్న వారి వివరాలను ఆదాయ పన్ను శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా ఒకేసారి ఎక్కువ ఖాతాలకు డబ్బులు బదిలీ చేసినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక ఖాతా తీసుకోవాలని, అన్ని లావాదేవీలు అదే ఖాతా నుంచి చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల ఖాతాలపై దృష్టిపెట్టాలని వివరించారు. ఏటీఎంలు, బ్యాంకులకు నగదు తరలించే ముందు వాహనం నంబర్, వెళ్లే వారి పూర్తి వివరాలు, ఎంత డబ్బు తీసుకెళ్తున్నారు.? తేదీ తదితర వివరాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఈఎస్ఎంఎస్(ఎలక్షన్ సీజ్యుర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) యాప్ వినియోగంపై వివరించారు. ఎన్నికల నియమావళిని బ్యాంకు అధికారులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, ఆయా బ్యాంకుల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్: సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు

- నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పెద్దలింగాపూర్, రామోజీపేట గ్రామాల్లో ఎండిన పంటల పరిశీలన

పెద్దలింగాపూర్‌లో సాగునీరు లేక ఎండిన వరి పంటలను పరిశీలించి స్థానిక రైతులు,నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, మార్చి21: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో సిరులు పండించిన రైతాంగం కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లు పెడుతున్నదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దలింగాపూర్, రామోజీపేట గ్రామాల్లో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద్దేడ్చినన ఎవుసం.. రైతేడ్చిన రాజ్యం ఎన్నడూ నిలువదన్నారు. కోతకు వచ్చే దశలో పంటలు ఎండిపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుపై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేల నిర్లక్ష్యం, అవగాహనలేకే సాగునీరందించలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు అలుగులు దుంకాయని, ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని గుర్తుచేశారు. నీరందక పంటలు ఎండిపోయిన రైతులపై రాళ్ల వర్షం రూపంలో కడగండ్లు మిగిలాయన్నారు. పెట్టుబడి కూడా చేతికిరాక అప్పుల భారం పెరిగే ప్రమాదం ఉందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుదేనన్నారు. అనంతరం ఆయన ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నేతలు సుధాకర్‌రెడ్డి, మీసరగండ్ల అనిల్, శ్రీనివాస్, భాగ య్య, భిక్షపతి, బాలరాజు ఉన్నారు.

రేపటి నుంచి త్రిరాత్రోత్సవాలు

వేములవాడ టౌన్, మార్చి21: రాజన్న ఆలయంలో ఈ నెల 23నుంచి 25 వరకు మూడు రోజులపాటు త్రిరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ స్థానాచార్యుడు భీమాశంకర్ వెల్లడించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కామదహనం ఉంటుందన్నారు. ఉత్సవమూర్తులకు వేదపండితులు విశేష పూజలు చేసి పవళింపు సేవతో డోలోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ, మార్చి 21: శాత్రాజ్‌పల్లికి చెందిన సుధగోని ఈరవ్వ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ క్రమంలో గురువారం ఆమెను బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

హైరిస్క్ కేసులపై దృష్టిసారించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్షా సమావేశం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఇల్లంతకుంట, మార్చి21: గర్భిణుల్లో హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అన్ని ఉప కేంద్రాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్యశాఖల ద్వారా అమలవుతున్న ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సహజ కాన్పులను పెంచడానికి నోడల్ అధికారిని నియమించాలన్నారు. గర్భిణులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు ఎక్కువ సంఖ్యలో అయ్యేవిధంగా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, హెచ్ఐవీ, థైరాయిడ్, రక్తపరీక్షలు చేయాలన్నారు. మానసిక ఒత్తిడి, ఇతర ఇబ్బందులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలలో ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచిన వైద్యసిబ్బందిని అభినందించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డాక్టర్ రజిత, ప్రోగ్రామ్ అధికారులు ఉమ, నయీమ్ జహా, మండల వైద్యాధికారి శరణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని నియమించాలి

వీర్నపల్లి, మార్చి21: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికశాఖ మంత్రిని నియమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, అందులో పొందుపర్చిన పథకాలు మాత్రం అమలు చేయడంలేదన్నారు. కార్మికుల పిల్లల పెండ్లిళ్లకు అందించే బెన్‌ఫిట్ ₹1.50లక్షలకు పెంచాలని, సహజ మరణానికి ₹3లక్షలు ఇవ్వాలన్నారు. ఇక్కడ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు అరుణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్, రాజు, రాజం, చంద్రయ్య, శంకర్, అంజయ్య, కృష్ణ ఉన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- డీపీవో వీరబుచ్చయ్య
- పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం

ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

ఎల్లారెడ్డిపేట, మార్చి 21: వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తించాలని డీపీవో వీరబుచ్చయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లా మొత్తం ₹7.07కోట్లు పనులు వసూ లు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు ₹6.5 6 కోట్లు వసూలు జరిగాయని, దీంతో ఇప్పటికే రాష్ట్రంలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. మండలంలో ₹18లక్షలు వసూ లు చేశామని, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి కార్యదర్శి ఉదయం 11గంటలలోగా శానిటేషన్ రిపోర్టు పంపాలని, చెత్త సేకరణ, డంప్‌యార్డుకు తరలింపుపై దృష్టిపెట్టాలని సూచించారు. పంచాయతీ పరిధిలో వర్మి కంపోస్టు ఎరువును తయారుచేసేలా చూడాలన్నారు. ఎరువు కిలో ₹20చొప్పున విక్రయించే లా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యం సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. ఇక్కడ డీఎల్‌పీవో మల్లికార్జున్, ఎంపీడీవో సత్త య్య, ఎంపీవో వజీర్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సేవాభావం అభినందనీయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, మార్చి 21: ముస్లింలందరూ రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కొనియాడారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్ ఆకుల కృష్ణ సరుకులు అందజేశారు. దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు పేదలకు ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. ఇక్కడ నిర్వాహకులు బాబా, నాయకులు శ్రీనివాస్, సలీం, పాషా, రఫీ, అన్సర్ పాషా, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, CHEKKABANDI APARNA, R/o. 2-75, Renikunta, Thimmapur, Karimnagar, TS. Changed My Name as CHEKKABANDI SUMALATHA, W/o. Devender Reddy.
NT-328433

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వేములవాడ టౌన్ పోలీసులపై పోలీస్ బాస్ సీరియస్

- అవినీతి ఆరోపణలపై ఆగ్రహం
- హెడ్‌క్వార్టర్స్‌కు ఐదుగురు కానిస్టేబుళ్లు అటాచ్

వేములవాడ, మార్చి 21: క్షేత్రస్థాయిలో అవినీతిలేని పరిపాలన, ప్రజలకు చేరువయ్యే విధంగా సేవలందించాలని ఎప్పటికప్పుడు సిబ్బందిని ఆదేశిస్తున్నా.. తీరు మారకపోవడంతో ఎస్పీ అఖిల్‌మహాజన్ సిరీయస్‌అయ్యారు. ఈ క్రమంలో వేములవాడ పట్టణ పోలీసులపై వేటు వేశారు. బ్లూకోల్ట్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్, శ్రీనివాస్, సురేశ్, బాలయ్య, రైటర్ శంకర్‌తోపాటు ఐదుగురు హోంగార్డులతో కలిపి మొత్తం పది మందిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. కాగా, వేములవాడలో ఇసుక వ్యాపారం జోరుగా కొనసాగుతుండగా, పోలీస్‌శాఖ మాత్రం తీవ్రంగా పరిగణిస్తున్నది. బ్లూకోల్ట్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చూసీచూడనట్లు వదిలివేయడం వెనుక లోతైన విచారణ జరిపిన పోలీస్‌బాస్ తీవ్రంగా పరిగణిస్తూ ఐదుగురిపై వేటు వేశారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు

ముస్తాబాద్/కోనరావుపేట, మార్చి 21: ముస్తాబాద్ మండలం గూడెంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈడుగురాళ్ల రాజేశంగౌడ్ వద్ద రూ.18,540విలువైన మద్యం, కొమిరె ఎల్లం వద్ద రూ.9,060, ఈడుగురాళ్ల రాంచంద్రం వద్ద రూ.20వేల మద్యం సీసాలు పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే కోనరావుపేట మండలం మల్కపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై పోలీసులు తనిఖీలు చేశారు. వెంకటి, నాగరాజు వద్ద నుంచి రూ.9వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ముస్తాబాద్, మార్చి 21: ఆవునూర్‌కు చెందిన మహ్మద్ చాంద్‌పాషా ఆవునూర్‌తో పాటు పలు గ్రామాల్లో మహిళల నుంచి నెలనెల రూ.500నుంచి రూ.2వేల వరకు వసూళ్లు చేసేవాడు. తిరిగి ఇచ్చేక్రమంలో కాలయాపన చేస్తున్నాడంటూ బాధితులు గురువారం ముస్తాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి, మార్చి 21: ఎన్గల్ గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ రోడ్డుపై వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి బస్టాండ్ వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయరాజ్ రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. చికిత్స కోసం అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా దవాఖానకు తరలించారు.

ఎల్లమ్మ సిద్ధోగానికి వినోద్‌కు ఆహ్వానం

వినోద్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న మండెపల్లి గౌడ సంఘం నేతలు

సిరిసిల్ల రూరల్, మార్చి 21: మండెపల్లిలో త్వరలో జరిగే ఎల్లమ్మ సిద్ధోగానికి రావాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గౌడ సంఘం నాయకులు గురువారం ఆహ్వానించారు. కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి వేడుకకు రావాలని కోరగా, వినోద్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. ఇక్కడ గౌడ సంఘ నాయకులు బలరాంగౌడ్, కిషన్‌గౌడ్, సీనియర్ నేత బుస్స లింగం, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత జక్కుల నాగరాజుయాదవ్, తదితరులు ఉన్నారు.

డాటాను సక్రమంగా నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

కలెక్టరేట్, మార్చి 21: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల అమలుతీరు, సంఖ్యలను ఎప్పటికప్పుడు సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎంఐఎస్), హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పీహెచ్‌సీ వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎం సిబ్బందికి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ కేంద్రాల పనితీరు, సుఖరోగాలు నిర్ధారణ పరీక్షల గురించి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కార్యక్రమ నిర్వహణాధికారి కే సురేందర్‌రెడ్డి వివరించారు. హెచ్ఎంఐఎస్ డేటా సేకరణతోపాటు సకాలంలో సక్రమంగా డాటాను పూర్తి చేయాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో అలసత్వంవద్దన్నారు. కార్యక్రమంలో డీడీఎంహెచ్‌వో డాక్టర్లు రజిత, శ్రీరాములు, పీవో డాక్టర్ ఉమ, డీడీఎం కార్తీక్, వైద్య ఆరోగ్యశాఖ ఏవో శ్రీనివాస్, బాలయ్య, పద్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, గంగయ్య, దయాకర్, గాదె రమేశ్, టెక్నిషియన్లు శివ, శ్రీనివాస్, సుమన్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి అర్హులుగా ప్రకటించండి

- 'జీరో బిల్లు' రాలేదని వినియోగదారుల ఆందోళన

గంభీరావుపేట, మార్చి 21: గృహజ్యోతి పథకంలో తమను అర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సెస్ వినియోగదారులు నిరసన తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన తమకు గృహజ్యోతి పథకం ద్వారా జీరో బిల్లు రాలేదని వారు వాపోయారు. జీరో బిల్లురాని అర్హులందరూ తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పినా.. మండల పరిషత్‌లో తమ దరఖాస్తులు ఎవరూ తీసుకోవడం లేదని మండిపడ్డారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెప్పినా.. ఇక్కడ అధికారులు మాత్రం తమ గోడును పట్టించుకోడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు.

560 ఎకరాల్లో పంట నష్టం

ముస్తాబాద్, మార్చి 21: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో 560ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. మండల కేంద్రంతోపాటు పోతుగల్, గన్నెవానిపల్లి, సేవాలాల్ తండా, మొర్రాయిపల్లి, ఆవునూర్, గూడెం, తెర్లుమద్దిలో పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించిట్లు తెలిపారు. ఇక్కడ జిల్లా వ్యవసాయ అధికారి వీ భాస్కర్, మండల అధికారి వెంకటేశ్, ఏఈవోలు, ప్రజాప్రతినిదులు, రైతులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కోనరావుపేట, మార్చి 21: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ధర్మారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని, సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇక్కడ పద్మజ, ఎంఈవో దూస రఘుపతి, పిన్సిపాల్ ఇందిరా, తదితరులు ఉన్నారు.

ప్రమాద బీమా ప్రొసీడింగ్ అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 21: మండల కేంద్రానికి చెందిన పెంటం కుమార్ ఇటీవల మృతి చెందగా, రూ.2లక్షల ప్రమాదబీమా ప్రొసీడింగ్ కాపీని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అందించారు. ఇక్కడ నాయకులు పందిళ్ల పరశురాములు, చందనం శివ, ఎడ్ల సందీప్, మహ్మద్ సల్మాన్, కార్తీక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



ప్రమాద బీమా ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న నాయకులు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

సిరిసిల్ల పట్టణంలో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కేంద్ర బలగాలు

తెలంగాణ చౌక్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి సూచించారు. గురువారం సిరిసిల్ల పట్టణ పరిధిలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నిక లు శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్ లెన్స్ సైట్

సిరిసిల్ల రూరల్, మార్చి 21: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలో గురువారం ఫొటోగ్రఫీ డిపార్ట్‌మెంట్,